# దూరపాలోచన

"ఏమండి, కాఫీహోటలుకని వెళ్లి మూడుఝాముల పొద్దెక్కి వచ్చారు ?"

గంగాధరం గుమ్మం ఎక్కుతోంటే అతని భార్య పార్వతి అడిగిన ప్రశ్న యిది.

"నయంకాదూ, వాడిప్పటికైనా వదిలి పెట్టాడు !"

"ఎవరు ?"

"ఎవరింక ? ఆ రమణయ్యే. బజారంతా తిప్పాడు."

"రమణయ్యగారి కిప్పుడు బజారుపనేమిటి చెప్మా ? భార్యేమో పుట్టింట వుందాయిరి. బియ్యంతేవాలా ? పువ్వులుతేవాలా ? పూటకూళ్లింట భోంచేసి సినిమాలమ్మట తిరగడమేగా ?"

"నిజమే. కాని అతగాడి భార్యకి నేడో రేపో పురుడొస్తోందిట."

"ఐతే, ఖాయపు సరుకులేవో ఇక్కడ కొని పంపుతున్నారా ?"

"కాదో ఓవిడా, పూర్తిగా చెప్పనివ్వవుకదా ఖర్మం !"

"చెప్పండి !"

"ఆవిడ మగపిల్లవాణ్ణే కంటుందని నేనూ రమణయ్యా నిర్ధారణ జేశాం."

"ఎలాగ ? బ్రహ్మ యీ విషయం యేమైనా మీతో ముందుగా సంప్రదించాడా ?"

"ఈమాత్రం దానికి బ్రహ్మదాకా వెళ్ళాలా ? విను. రమణయ్యకి మనస్సులో, కొడుకే పుట్టాలని ఉంది."

"మగమాణిక్యం పుట్టి ఉద్ధరిస్తాడని కామోసు !"

" 'మగపిల్లాడా, లేక ఆడపిల్లేనా ?' అని నన్ను జోస్యం అడిగాడు"

"మీరూ, 'మగపిల్లాడే పుడతాడ'ని చెప్పారుకదూ ?"

"మరోలాచెప్పి వాణ్ణి చిన్నబుచ్చుతానా మరి? తప్పకుండా కొడుకే పుడతాడన్నాను. ఈ అనుకూల జోస్యానికి బహుమతికింద ఈరోజు కాఫీ హోటలు ఖర్చు వాడు భరించాడు."

"బాగుంది."

"ఐతేం? ఆ తిన్న రెండు ఇడ్డెన్లూ అరిగిపోయేటట్లు బజారంతాతిప్పి వదిలిపెట్టాడు."

"ఎందుకు ?"

"ఆ పుట్టబోయే పురుషపుంగవుడికి కావలసిన సామాగ్రంతా ఈ రోజునే కొనెయ్యాలని రమణయ్యకు తోచింది."

"తొలిచూలు గనక పిల్లవాడికి ఐదోనెల వస్తేగాని పంపరు. ఏం కొన్నా అప్పుడుగాని ఇప్పట్నుంచీ ఎందుకో ?"

"ఎందుకేమిటి? రమణయ్య కాస్త ముందు జాగ్రత్తున్న మనిషి. చటుక్కుని ఆవేళకు కావాలంటే దొరకవేమో అని పాలడబ్బాలూ వగైరా కొనేశాడు."

"పాలడబ్బాలా? పురుడొచ్చి తల్లికి పాలులేవని నిర్ధారణైతే పాల టిన్నులు గాని___"

"నే చెప్పేనామాట. కొనిఉంచితే వచ్చిన నష్టమేమి టన్నాడు. ఆముదం సీసాలు, రబ్బరు పక్కగుడ్డలు ఇవన్నీ కొనేశాం."

"అవి చెడిపోయేవి కాదులెండి. ఇంకా యేంకొన్నారు ?"

"పిల్లవాడు ఎదిగేక తొక్కడానికని మూడుచక్రాల తొక్కుడుబండి."

"శబాష్, బాగుంది."

"స్కూలుకు వెళ్ళేరోజుల్లో పుస్తకాలు పెట్టుకుని బుజానతగిలించుకుని వెళ్ళటానికి పటకాఉన్న తోలుసంచి."

"ఔను. అవీ అవసరమే."

"పరీక్షలో రాసుకోడానికో ఫౌంటెన్ పెన్."

"అదీ ముఖ్యమే మరి."

"ఆడుకోడానికి క్రికెట్టు బేట్టు, పెట్టుకోడానికో దొరటోపీ."

"బాగానే ఉంది, ఇంక ఒక్కటే చూడవలసినది."

"ఏమిటి?"

"అబ్బాయికి పెళ్లికూతురు!"

"చానిక్కూడా ఈపాటికి రమణయ్య ఏదో ప్లాను వేసేఉంటాడు. ఔనుగాని, మూడుఝాములైందని తెలిసికూడా నన్నిలా నిలబెట్టి మాటలు చిత్తగిస్తున్నావుగాని భోజనంమాట ఎత్తావేగాదు. ఆ రమణయ్య ఇప్పుడే కొంచెంసేపట్లో మళ్లీ వస్తానన్నాడు. ఇంకా ఏదో ఆలోచించాలిట. ఈ లోపుగా రెండు మెతుకులు పడేస్తే బాగుంటుంది."

గంగాధరం భోజనంచేసి పెరట్లో చెయ్యి కడుక్కుంటూంటే వీధిలో రమణయ్యగొంతు వినిపించింది. ఎవడితోనోగాని అతను కాస్త దూకుడుగానే అంటున్నాడు:

"అయ్యా, 'నే చెప్పను; నాకు చెప్పటం ఇష్టంలేదు' అన్నప్పుడు మీ దారిని మీరుపోక ఈ అధికప్రసంగం ఎందుకు?"

అందు కవతలాయన: "అధికప్రసంగ మేముందండీ? 'ఈమాత్రం చెబితే అరిగిపోతారా?" అన్నాడు. "మీకంత కోపమైతే పోనివ్వండి" అంటూ వెళ్లిపోయాడు. గంగాధరం రమణయ్యని లోపలికి రమ్మని,

"ఎవరోయ్ ఆ మనిషి?"

"ఎవడో కోన్‌కిస్ కాయ్."

"అసలు ఏమిటి పేచీ?"

"నేను మీ గుమ్మం ఎక్కుతోంటే పనిగట్టుకొచ్చి, 'సార్, సార్, టైమెంత అయిందండీ?' అన్నాడు."

"నీకు రిస్టువాచీ ఉండటం చిక్కే వచ్చింది. ప్రతీ వాజమ్మా టైమడుగుతుంటాడు?"

"'అయ్యా మీకు టైము చెప్పటం నాకిష్టంలేదు. కనుక దయచేసి తమదారిని వెళ్ళండి' అన్నాను."

"బాగుంది. చాలా మర్యాదగానే చెప్పేవు."

"ఐతేం? అతను వెళ్ళడే! 'అలాగంటారేమిటండీ? కాస్త టైము చెబితే అరిగిపోతారా?' అంటూ టూమచ్‌గా మాటాడ్డం మొదలెట్టాడు."

"టూమచ్‌గా మాట్లాడ్డం తప్పే. నిలబడే ఉన్నావ్, కూచో...
ఐతే, సంగతి తెలుసుకోడాని కడుగుతున్నాను! ఎవరూ అడక్కుండానే నీ అంతట నువ్వే పైమెంతఐందో చెప్పేసేటంత పరోపకారబుద్ధి కలవాడవుకదా, అలాంటి దీనాడు అతగాడిమీద ఇంత చిరాకూ కోపం కనపర్చావెందుచేతా?" అనుకుంటున్నాను."

"కోపం ఏమీలేదు. కొంచెందూరం ఆలోచించే అతగాడికి పైము చెప్పటం మానేశాను."

"ఆ దూరపాలోచన ఏమిటో కాస్త వివరంగా చెప్పాలి."

"ఏంలేదూ. విను. అతగాడి మొహం మనం ఇదివరలో ఎన్నడూ చూడలేదు."

"లేదు."

"ఈ అపరిచితుడి కీనాడు మనం పైము చెప్పామూ అంటే ఇతనికీ మనకీ ఓ విధంగా పరిచయం కలుగుతుందంటావా?"

"కలుగుతుంది."

"ఇంక వీధిలో ఎప్పుడెదురుపడ్డా గుడ్ మార్నింగులూ, మందహాసాలూ మొదలెడతాడు."

"పెట్టొచ్చు. కాని దానివల్ల మనకు రాబోయే నష్టమేమిటి అని."

"విను చెబుతా ఈ పరిచయం క్రమంగా ఎక్కువై, మనయింటికితడు తరుచు వస్తూ వెడుతూ ఉండడం జరుగుతుంది."

"జరగొచ్చు. కాని ఇంటికెవరొచ్చినా కూచుని బాతాఖానీవేసే ఓపికా, తీరికా గూడా నీకున్నాయిగా?"

"ఉత్త బాతాఖానీతో వదులుతుందా గంగాధరం? కాఫీలు, ఉప్మాలు—ఈ మామూలు కార్యక్రమం అంతా నడుస్తుంది."

"పోన్లే, అదంతా మీ ఆదరణనుబట్టి ఉంటుందనుకో. ఊ...చెప్పు"

"చెప్పొచ్చేదేమిటంటే, ఇతనికీ మనకీ మైత్రి గాఢమౌతుంది."

"ఐతేం, స్నేహం కోరదగినదే కదుటోయ్ రమణయ్యా?"

"గొప్పవాళ్లతో స్నేహమైతే కోరదగినదేకాని ఇటువంటి నిర్భాగ్యుడి స్నేహమా మరి?"

"ఇతడో నిర్భాగ్యుడంటావ్ ?"

"కాకపోతే క్లైము అవసరముండీ కూడా రిష్టువాచీ ఎందుకు కొనుక్కోడు ?"

"ఔను రమణయ్యా, నువ్వు చెప్పింది సబబుగానే ఉంది."

"సాధారణంగా నిర్భాగ్యులకే ఆడపిల్లలెక్కువగా ఉంటారు. ఈ తండ్రులపని అస్తమానూ పెళ్ళికొడుకుల్ని వెతకటంతోనే సరిపోతుంది."

"పోవచ్చుగాని, అందువల్ల నీకొచ్చిన నష్టమేమిటి?"

"విను. ఈ నిర్భాగ్యుడికిగూడా ఆడపిల్లలు బయల్దేరుతారు. ఆ పిల్లలకి సంబంధాలు వెతకవలసొస్తుంది. మనతో స్నేహం కలిగి మనింటికి రాకపోకలు సాగిస్తోన్న యీ మనిషికన్ను, గోవగా ఎదిగి కాలేజీకి వెడుతూవుండే మా కుర్రవాడిమీద పడుతుంది."

"ఆరి నీ కడుపు బంగారంగానూ! ఎంత దూరం ఆలోచించావ్ ? మొదట నీకు కొడుకుపుట్టాలి. ఆ తర్వాత ఆరేళ్ళకో ఏడేళ్ళకో, నిన్ను ఇప్పుడు క్లైమడిగిన యీ నిర్భాగ్యుడికి ఆడపిల్ల పుట్టాలి. ఆ పిల్లకి పద్దాను గేళ్ళొచ్చాక గదా పెళ్లి ప్రయత్నం? అంటే ఇరవైయేళ్ల పైమాటన్న మాట."

"ఇరవయ్యేళ్ళంటే ఎంతసేపోయ్. ఇట్టే తిరిగొస్తాయి."

"ఐతేమాత్రం ఇతను తన కూతుర్ని మీ పిల్లవానికి చేసుకోమన్నంత మాత్రాన్ని మీరూరికే వప్పుకోవాలని ఎక్కడుంది? కట్నం కానుకలూ ఇస్తేనే ఆలోచిస్తారు."

"రిష్టువాచీఐనా కొనుక్కోలేని నిర్భాగ్యుడు మనకియ్యగల కట్నమేముంటుంది గంగాధరం?"

"ఐతే 'మాకు సరిపడద'ని మానెయ్యొచ్చు."

"అలా మానెయ్యటం అంత తేలిగ్గా ఉండదు. స్నేహంమీద మొగమోటాలొస్తాయి. ఆడవాళ్ళదగ్గిర రాగాలు ప్రారంభిస్తారు. పిల్లవాడికి పిల్లనిచూపి వలలో వేసుకుంటారు. అప్పుడు మనం కాదంటే అడ్డుతగినట్లుంటుంది చూడూ. ఎందుకూ ఇంతగొడవ? ఎప్పుడూ అంత్యనిష్ఠూరంకన్న

ఆదినిష్ఠూరం మెరుగు. అందుకే ఇతనికీ మనకీ అసలు పరిచయం కలక్కుండానే మొదటే తుంచేశాను.”

గంగాధరంతో మాట్లాడుతూన్న రమణయ్య దృష్టి వీధిలో పోతున్న పోస్టు బంట్రోతుమీద పడింది.

“ఏమోయ్, నాకేమైనా ఉత్తరాలున్నాయా?”

“రమణయ్యగారా? ఇక్కడున్నారా?” అంటూ ఇతగాడో కార్డుతీసి ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ కార్డుకు పసుపు బొట్లుండటం చూసి, గంగాధరం “మీ మామగారు రాసినట్లున్నారోయ్. పురుడొచ్చినట్లుంది. ఏదీ, ఇలా తే. నా జోస్యం ఎంతవరకు రైటయిందో చూద్దాం” అని లాక్కున్నాడు. ఆ శుభవార్త ఏమిటో విందామని పార్వతికూడా లోపలి గుమ్మం వద్దకు వచ్చి నిలబడింది. గంగాధరం పైకిలా చదివాడు.

“చిరంజీవి మా అల్లుడు వలివేటి రమణయ్యను సోమాపంతుల మల్లికార్జునుడు త్రికాలములయందూ ఆశీర్వదించి వ్రాయునది—ఉభయకుశలోపరి— ఈ దశమీ శుక్రవారం రాత్రి 1-35 నిముషములకు హస్తానక్షత్ర ప్రథమ పాదమున చిరంజీవి సౌభాగ్యవతి సూరీడు సుఖప్రసవమై ఆడపిల్లను కన్నది. మాతాశిశువులు క్షేమముగా ఉన్నారు. పథ్యము పెట్టిన పిమ్మట మళ్లీ జాబు వ్రాసెదను. బారసాలనాటికి ఇక్కడకువచ్చే ప్రయత్నంలో ఉండవలెను.”

రమణయ్య ముఖం వెల్లబోయింది. వచ్చే నవ్వాపుకుంటూ పార్వతి లోపలికెళ్ళిపోయింది. గంగాధరం “బారసాలకు రమ్మని రాశాడురా, మీ మామ” అన్నాడు.

“అఘోరించలేకపోయావులే” అంటూ రమణయ్య కోపంగా లేచి వెళ్ళిపోయాడు.